క్లుప్తంగా

అర్హులకు పథకాలు అందించేందుకే..



సర్వేలో పాల్గొన్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: అర్హులకు సంక్షేమ ఫలాలను అందించాలనే ఉద్దేశంతో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని మరుపెంట గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందలేదనే మాట ఏ ఒక్కరి నుంచి వినిపించకూడదనే ఉద్దేశంతో ప్రతీ గడపకు వెళ్లి పథకాలకు అర్హులైన వారిని గుర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తోటపల్లిలో ప్రత్యేక పూజలు



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు.

రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ ప్రసన్నకుమార్

గరుగుబిల్లి: రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండల పరిధిలో ఉద్యాన కళాశాల విద్యార్థులు దత్తత తీసుకున్న సంతోషపురం, సుంకి గ్రామాల్లో శనివారం రైతు దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంటల సాగు, మద్దతుధర, మార్కెటింగ్ సౌకర్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.రాంబాబు, కె.రవీంద్ర, మాజీ సర్పంచ్ ఎ.గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సత్కారం



రైతును సత్కరిస్తున్న శాస్త్రవేత్తలు

సీతంపేట: స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉత్తమ రైతులను సత్కరించి అధిక దిగుబడినిచ్చే వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి పి.సీతారాం, ఎస్.లక్ష్మీనారాయణ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల వితరణ



ట్రైసైకిల్ అందుకున్న వృద్ధురాలితో హరిబాబు, గ్రామస్తులు

వీరఘట్టం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని దశుమంతపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వావిలపల్లి హరిబాబు తన సొంత డబ్బులతో ట్రై సైకిళ్లు కొనుగోలు చేసి ఇద్దరు దివ్యాంగులకు అందజేశారు. పేదల కోసం నిరంతరం తపనపడే రాజన్న జయంతి రోజున దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

150 లీటర్ల సారా ధ్వంసం

పాలకొండరూరల్: వివిధ కేసుల్లో పట్టుకున్న 150 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ బి.శివప్రసాద్ శనివారం తెలిపారు. అలాగే ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేసినట్లు చెప్పారు. వేలం ద్వారా రూ.33,500 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

రైతు బాంధవుడు వైఎస్సార్

- వాడవాడలా వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవం
- మహానేతకు ఘన నివాళి

రైతు బాంధవుడు, సంక్షేమ సారథి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి(రైతు దినోత్సవం) వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రైతులు, నిరుపేదల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆరోగ్యశ్రీతో లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ప్రాణప్రదాతగా.. జలయజ్ఞం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో సాగును పండగలా మార్చిన రైతు బాంధవుడుగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. జోహార్ వైఎస్సార్.. జయహో రాజన్న నినాదాలతో హోరెత్తించారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



కురుపాం: సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, పార్టీ నాయకులు



కొమరాడ: జంఝావతి కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ద్వారపురెడ్డి జనార్దనరావు, తదితరులు



గరుగుబిల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఇందుమతి, తదితరులు



జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



పాలకొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నాయకులు



గరుగుబిల్లి: బీవీపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి నినాదాలు చేస్తున్న సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ రూపవతి, తదితరులు



సీతంపేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పార్టీ నాయకులు



వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎంపీపీ దమలపాటి, నాయకులు



పాలకొండ రూరల్: నవగాం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెలే కళావతి, పార్టీ నాయకులు



సీతంపేట: సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు



భామిని: వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

వ్యవసాయ రంగానికి పెద్దపీట



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్
- పాలకొండలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

పాలకొండ: ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.60 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింటింగ్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రతీ నియోజకవర్గంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రభుత్వం అందుబాటులోనికి తీసుకొచ్చిందన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తుల నాణ్యతను ఇక్కడ పరీక్షించుకోవచ్చన్నారు. రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈ కేంద్రాన్ని రైతు దినోత్సవం, వైఎస్సార్ జయంతి రోజున అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగరపంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి, ఎంపీపీ బి.భాను, వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి, నాలుగు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, శాసుబిల్లి జనార్దనరావు, బంకి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అగ్రిల్యాబ్‌తో అన్నదాతకు భరోసా

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- కురుపాంలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం



వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: అన్నదాతకు అండగా వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ లాబ్స్ నిలుస్తాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో నాబార్డు నిధులు రూ.55 లక్షలు, ఆర్‌కేవీవై నిధులు రూ.5.60 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనం మంచిదైతే పంట బాగుంటుందని, నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్ భరోసా కల్పిస్తాయన్నారు. రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను, అగ్రిటెస్టింగ్ లాబ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని, వాటి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు టి.వి.ఎస్.స్వామియాజు లు, వెలమల బంగారునాయుడు, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, పార్టీ నాయకులు శెట్టి నాగేశ్వరరా వు, అంధవరపు కోటేశ్వరరావు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరా కుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ నిర్మల జ్యోతి, ఏఓ కె.జి.హర్షలత, ఏఈఓలు పి.సురేష్, కె.సూర్యనారాయణ, ఐదు మండలాల ఏఓలు పాల్గొన్నారు.

వంగరలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవికుమార్

గుమ్మలక్ష్మీపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మండలంలోని వంగర గ్రామంలో రాఫ ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. మధుశ్రీ హెల్త్ కేర్ వైద్యుడు రవికుమార్ సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తదితరులు సందర్శించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య, తదితరులను అభినందించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా తెగుళ్ల బారినుంచి పంటలను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామంలో విత్తనశుద్ధి, బీజామృతం తయారీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విత్తనశుద్ధి చేయడం వలన మొలక శాతం పెరగడంతో పాటు హానిచేసే సూక్ష్మజీవుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. ఫలితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగానికి చేసే ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. వరి, చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజలు మొదలగు పంటలకు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఎం.ప్రభావతి, మాజీ సర్పంచ్ అడ్డాకుల గంగరాజు, మండల కోఆర్డినేటర్ పరశురాం తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను కోరిన గిరిజన సంఘాల నాయకులు

సాలూరు:

ఐటీడీఏ పరిధిలోని సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలో ఆయన స్వగృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలో గతంలో పనిచేసిన ఆరోగ్య సిబ్బందిని మరలా విధుల్లోకి తీసుకోవాలని.. ఖాళీగా ఉన్న సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేయాలని.. గతంలో పనిచేసిన భాషా విద్యా వలంటీర్లను విధుల్లో తీసుకోవాలని.. ఐటీడీఏలో పనిచేస్తున్న దినసరి వేతనదారుల ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని.. గిరిజన మ్యూజియాలను ఏర్పాటుచేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పలు గిరిజన సంఘాల నాయకులు దుక్క సీతారాం, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, సంగంరెడ్డి జయసింహ, కోలక గౌరమ్మ, రవణ, గౌరీపతి, సీతారాం, బంగార్రాజు, శంకరరావు, బాబూరావు తదితరులున్నారు.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు

భామిని: మండలంలోని బాలేరులో 49జగనన్న గృహాల లేఅవుట్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పీఓ పి.కల్పనాకుమారి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, సర్వేయర్లు రాజేశ్వరరావు, టి.రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్వోలు శనివారం గ్రామానికి వెళ్లి వివాదాస్పద గృహ స్థలాలను పరిశీలించారు. స్థలాలను జియోట్యాగింగ్ చేశారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన కొందరు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. గతంలో తమకు ఇచ్చిన పట్టాలపై నిలదీశారు. తమ సమస్యను పీఓ దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు చెప్పడంతో శాంతించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్

జియ్యమ్మవలస: ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ డీవీజీ శంకరరావు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును చినమేరంగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పశ్రీవాణి దంపతులు సత్కరించి అభినందించారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- కోటిపాంలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభం



కొమరాడ: కోటిపాంలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: జగనన్న ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కోటిపాం గ్రామంలో రూ.46 లక్షల వ్యయంతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాంధీజీ కలగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారన్నారు. గ్రామస్థాయిలో మెరుగైన విద్య, వైద్యం, సురక్షిత తాగునీరు అందించడంతో పాటు రోడ్లు, విద్యుత్, డ్రైయిన్లు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్న జగనన్నకు మనమంతా అండగా నిలవాలని, 2024లో మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, సీనియర్ నాయకుడు శెట్టి మధుసూదనరావు, సర్పంచ్ సుంకరి సుగుణ, ఎంపీటీసీ కె.పార్వతి, కొమరాడ, శివిని పీఏసీఎస్ అధ్యక్షులు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వంగర పంచాయతీ డోలుకోన గ్రామానికి (కీసర మెయిన్ రోడ్డు నుంచి) ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు డోలుకోన గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. తమ గ్రామానికి రోడ్డు నిర్మించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వంగర సర్పంచ్ పత్తిక జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పత్తిక తిరుపతిరావు, పసుపురెడ్డి మహేష్, నిమ్మక కృష్ణారావు, భద్రగిరి టీడబ్ల్యూ డీఈ సింహాచలం, ఏఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుడ్డిలో విత్తనాల పండగ



ఆకట్టుకున్న విత్తనాలు ప్రదర్శన

సీతంపేట: వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ప్ సంస్థ ఆధ్వర్యంలో రోలుగుడ్డిలో శనివారం విత్తనాల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ప్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. అటవీహక్కు చట్టం అమలు, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. విత్తనాల పండగ ద్వారా ఆదివాసీ సాంప్రదాయల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త నీలవేణి, హెచ్ఓ జయశ్రీ, సమన్వయకర్త బి.శంకరరావు, రవీంద్రనాథ్, గణేష్ పాల్గొన్నారు.